



ఇది ఉమ్మడి జిల్లాలోనే పెద్దదైన బుక్కపట్నం చెరువు. ముంపు ప్రాంతంలో ఇలా పెద్ద పెద్ద ఇళ్లను నిర్మించారు. కాలనీనే ఏర్పాటు చేశారు. వరద వచ్చి చెరువు నిండితే కాలనీ మునగడం ఖాయం.

మునిగిపోతే మాకేంటి?

వైసీపీ హయాంలో బరితెగింపు

- యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ
- నదులు, వాగులు, వంకలనూ వదలని దుస్థితి
- లేఅవుట్లు వేసి.. ప్లాట్ల విక్రయాలు
- విచ్చలవిడిగా నిర్మాణాలు
- వందల ఎకరాలు కబ్జా
- వరద వస్తే.. మునకే..!

పుట్టపర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో కబ్జాలపర్వం సాగిందన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వ, పట్టా భూములను ఆ పార్టీ నాయకులు కబ్జా చేశారు. అవి చాలవన్నట్లు చెరువులనూ చెరబట్టారు. చెరువు ముంపు భూముల్లో లేఅవుట్లు వేశారు. కాలనీలే కట్టారు. వాగులు, వంకలు, ఆఖరుకు నదుల పరీవాహక ప్రాంతాలనూ వదల్లేదు. ఎక్కడికక్కడ కబ్జాలు చేస్తూ వచ్చారు. వందల ఎకరాలు అడ్డంగా అమ్మేసి, కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. వెరసి.. వందల ఎకరాల ముంపు భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో జిల్లాలో నదుల పరీవాహక ప్రాంతాలు, వాగులు, వంకలు, కాలువలు, చెరువుల విస్తీర్ణం తగ్గిపోయింది. ఫలితంగా వర్షాకాలం వచ్చిందంటే వాగులు, వంకలు, నదులకు వరదపోటుతో జనజీవనం స్తంభించిపోతోంది. ఇప్పటికైనా ఈ ఆక్రమణలపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే వరద వస్తే.. మునక తప్పదని జిల్లావాసులు వాపోతున్నారు.

బరితెగింపు

జిల్లాలో పెన్నా, చిత్రావతి నదుల పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణలతోపాటు చెరువుల్లో లేఅవుట్లు వేసి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా హిందూపురం చుట్టూ ఉన్న చెరువుల నైసర్గిక స్వరూపమే మారిపోయింది. కొట్నూరు, శ్రీకంఠపురం, సూరప్ప కుంట, నూగూరు పెద్దచెరువులోకి నిర్మాణాలు చొచ్చుకొచ్చాయి. చెరువుల్లోకి వచ్చే ఫీడర్, సప్లయ్ చానల్స్ పూర్తిగా ఆక్రమణలతో నిండిపోయాయి. గత వైసీపీ హయాంలో శ్రీకంఠపురం చెరువు ముంపు భూములను పూడ్చి, వైసీపీ నేతలు లేఅవుట్ వేశారు. పూలకుంట చెరువు వద్ద వైసీపీ రియల్ వ్యాపారులు రూ.5కోట్ల విలువ చేసే రస్తా పొరంబోకు భూమిలో రోడ్డు వేసి, లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఈ రెండు లేఅవుట్లకు చెరువు ముప్పు ఉందనీ, నిర్మాణాలు చేపట్టరాదని జలవనరుల శాఖ అధికారులు ఇచ్చిన నివేదికను గత ప్రభుత్వ పెద్దలు ఉన్నతస్థాయి అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి, తొక్కిపెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో యథేచ్ఛగా లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారు. ధర్మవరం చెరువులో పడమర, దక్షిణ భాగంలో వంద ఎకరాలకుపైగా ముంపు భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. అక్కడ భారీ నిర్మాణాలు వెలిశాయి. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో చిత్రావతి నది పరీవాహక ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. ఉమ్మడి జిల్లాలో పెద్దదైన



బుక్కపట్నం చెరువు ముంపు భూముల్లో ఆక్రమణలు పెద్దఎత్తున వెలిశాయి. ఏకంగా కాలనీలే కట్టేశారు. ఇలా జిల్లావ్యాప్తంగా కదిరి, మడకశిర, పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లో పలు చెరువులు, వాగులు, వంకలను కబ్జా చేశారు. పెన్నా, చిత్రావతి నదులకు ఇరువైపులా ఆక్రమణలతో వాటి నైసర్గిక స్వరూపమే మారిపోతోంది. నది పరీవాహక ప్రాంతం, చెరువు ముంపులో నిర్మాణాలు చేపట్టాలంటే జలవనరులు శాఖ అనుమతులు తప్పనిసరి. ఇది జిల్లాలో ఎక్కడా అమలు కావట్లేదు. ఆయా భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా గత ఐదేళ్లలో నది పరీవాహక, చెరువుల్లో లేఅవుట్లు, నిర్మాణాలు భారీగా వెలిశాయి. 2016-19 మధ్య జలవనరుల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా జిల్లాలోని చెరువుల్లో ఆక్రమణలపై సర్వే చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాయి. గత ప్రభుత్వం వాటిని తొక్కిపెట్టి, నదులు, చెరువుల్లో వైసీపీ నేతల కబ్జాల పర్వానికి అవకాశం కల్పించింది.

పాఠాలు నేర్వరా?



జిల్లాలో ప్రవహించే ప్రధాన నదులన్నీ కర్ణాటక నుంచి వచ్చేవే. వాటికి అనుసంధానంగా చెరువులు, కుంటలు నిర్మించారు. జిల్లాలో 1186 చెరువులు ఉండగా.. పెన్నా, చిత్రావతి నదులకు అనుసంధానంగా 500కిపైగా ఉన్నాయి. 2001-22 ఏడాదిలో కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు పెన్నా, చిత్రావతి, కుషావతి, జయమంగళి, పెన్నాకుముద్వతి, సువర్ణముఖి నదులతోపాటు వంకలు, వాగులు, అనుసంధానంగా వందలాది చెరువులకు వరద పోటెత్తింది. దీంతో జనజీవనం స్తంభించింది. ఇందులో హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల, పుట్టపర్తి, రొద్దం, ధర్మవరం, ఆగళి మండలాల్లోని సరిహద్దు ప్రాంతాల చెరువులకు కర్ణాటక నుంచి వరద పోటెత్తింది. కర్ణాటకలో కొన్ని చెరువులు తెగి సరిహద్దులోని చెరువులపై ఒత్తిడి పడింది. వరదలకు నది పరీవాహక ప్రాంతాలు, చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలు మునిగాయి. హిందూపురంలో వారాలకొద్దీ జనజీవనం స్తంభించిపోయింది. పుట్టపర్తి వద్ద చిత్రావతి ఉప్పొంగి, పలు కాలనీలను ముంచెత్తింది. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో నిధుల్లేక జిల్లాలో చెరువు కట్టలు, తూములు, కాలువల మరమ్మతులు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో చెరువుల భద్రతపై ఆందోళన చెందాల్సి వస్తోంది. గతంలో వరదల ముంపు నుంచి పాఠాలు నేర్వని అధికార యంత్రాంగం నది పరీవాహక, చెరువు ముంపులో నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవట్లేదు. భారీ వర్షాలు కురిసి వరద పోటెత్తితే నదుల అనుసంధానంగా ఉన్న చెరువుల సమీపంలో నివాసం ఉంటున్నవారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

నది పరీవాహక ప్రాంతాలు, చెరువులను ఆక్రమించినట్లు మా దృష్టికి వస్తే పరిశీలించి, చర్యలు చేపడతాం. గతంలో చెరువుల విస్తీర్ణంపై సర్వేచేసి, హద్దులు ఏర్పాటు చేశాం. ట్రెంచ్‌ల నిర్మాణం చేపట్టాం.

- గంగాధర్, జలవనరులశాఖ ఈఈ, పెనుకొండ

కూలి బతుకుల్లో విషాదం

సిమెంటు ట్యాంకర్‌ను ఢీకొన్న కూలీల వ్యాన్

- ఒకరి మృతి
- 29 మందికి తీవ్రగాయాలు


నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం


బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన సిమెంటు లారీ


శంకరప్ప (ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు 3: కూలీల కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. మండలంలోని నారేవాండ్లపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కూలీలు ప్రయాణిస్తున్న మినీ వ్యాన్ బైక్‌ను తప్పించబోయి ఎదురుగా వస్తున్న సిమెంటు ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో నల్లమాడ మండలంలోని గూడుమేకలపల్లికి చెందిన శంకరప్ప (55) దుర్మరణం చెందాడు. 29 మంది గాయపడ్డారు. బాధితుల్లో ఇద్దరు మినహా అందరూ నల్లమాడ మండలవాసులే. అందరూ కూలీలే. నల్లమాడ, కదిరి మండలాలకు చెందిన కూలీలు అన్నమయ్య జిల్లా ములకలచెరువులోని కేజీఎన్ టమోటా మండీలో గ్రేడింగ్ పనులకు సోమవారం వెళ్లారు. అర్ధరాత్రి వరకు పనిచేశారు. ఆ తర్వాత మినీ వ్యాన్‌లో ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. నారేవాండ్లపల్లి వద్దకు రాగానే బైక్‌ను తప్పించబోయి ఎదురుగా వస్తున్న సిమెంటు ట్యాంకర్‌ను కూలీల మినీ వ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో నల్లమాడకు చెందిన లక్ష్మీదేవి, అదే మండలంలోని గూడుమేకలపల్లి వాసి మోహన్, బొగ్గిటివారిపల్లికి చెందిన రమాదేవి, రాధ, రమణప్ప, ప్రసాద్‌నాయుడు, చలపతి, సరస్వతి, లక్ష్మీనరసమ్మ, శారద, సుబ్బలక్ష్మమ్మ, భాగ్యమ్మ, నారాయణమ్మ, సుబ్బరాయునిపల్లి వాసులు దొన్నికోట నరసింహులు, ఆదెప్ప, నాగేంద్ర, లలిత, సుమిత్ర, కాయలవాండ్లపల్లికి చెందిన ఉమేష్, రవికుమార్, ఆంజనేయులు, నాగేంద్ర, పాలినేనిపల్లి వాసి అమరనాథ్, కదిరి మండలం దిగువపల్లికి చెందిన కుమార్, మంజుల, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి కదిరికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన గంగాద్రి, లక్ష్మీదేవి, మోహన్, రమాదేవి, రాధను మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మోహన్‌ను కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని తనకల్లు పోలీసులు పరిశీలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు.


కదిరి ఆస్పత్రిలో క్షతగాత్రులు

గ్రామాల్లో విషాదఛాయలు

రోడ్డు ప్రమాదంలో ఒక కూలీ మరణించడం, 29 మంది గాయపడడంతో వారి వారి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. నల్లమాడ మండలంలోని గూడుమేకలపల్లికి చెందిన శంకరప్ప రెండురోజులుగా టమోటా మండీలో పనులకు వెళ్తుండేవాడు. సోమవారం గ్రామం నుంచి సహచర కూలీలతో కలిసి పనికెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు. శంకరప్పకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుమార్తెకు వివాహమైనట్లు తెలుస్తోంది.

వైసీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఉష శ్రీచరణ్

పుట్టపర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా అధ్యక్షురాలిగా మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటన వెలువడింది. గత సార్వత్రిక ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఉషశ్రీచరణ్ ఓడిపోయారు. ఆమె ప్రస్తుతం వైసీపీ పెనుకొండ సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను జిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నవీన్ నిశ్చల్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. వైసీపీ ఘోర పరాజయం తరువాత జిల్లా అధ్యక్షులను మారుస్తారన్న చర్చ సాగింది. ఈ నేపథ్యంలో నవీన్‌నిశ్చల్‌ను తప్పించి, ఉషశ్రీచరణ్‌ను నియమించడం ఆ పార్టీలో చర్చనీయాంశమైంది.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు: కలెక్టర్


చీనీ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 3: ఉద్యాన పంటల సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. రైతులకు సూచించారు. ధర్మవరం, బత్తలపల్లి మండలాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పంటల సాగుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ మేలైన దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 3: జిల్లాలోని పలుప్రాంతాల్లో సోమవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటనలో పేర్కొన్నారు. కనగానపల్లిలో అత్యధికంగా 13.2 మి.మీ, వర్షం కురిసిందన్నారు. బత్తలపల్లి 12.2, ధర్మవరం 4.6, రొళ్ళ 4.4, గుడిబండ 3.4, తాడిమర్రిలో 3.0 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

15 నుంచి క్రీడాపోటీలు

కొత్తచెరువు, సెప్టెంబరు 3: స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి మొరార్జీ యాదవ్ తెలిపారు. స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మొరార్జీ యాదవ్ మాట్లాడుతూ.. 15వతేదీ నుంచి మండల స్థాయి క్రీడాపోటీలుంటాయన్నారు. 21వతేదీలోగా నియోజకవర్గ, 30లోగా జిల్లాస్థాయి పోటీలు పూర్తి చేస్తామన్నారు. అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, యోగా, చెస్ పోటీలను అండర్-14, 17 విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మీనాక్షి, డిప్యూటీ డీఈఓ రంగస్వామి, ఏడీ లాజర్ పాల్గొన్నారు.

అమ్మబోతే అడవి..!

స్థానికంగా మార్కెట్‌లేక రైతుల ఇబ్బందులు

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో కర్ణాటకకు పంట దిగుబడులను తరలిస్తున్నారు. ఈ పరిస్థితిని ముఖ్యంగా కూరగాయలు సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్నారు. - చెన్నేకొత్తపల్లి

కూరగాయలు అమ్ముకునేందుకు తీవ్ర కష్టాలు

పంట దిగుబడులను కర్ణాటకకు తరలిస్తున్నవైనం



గోరు చిక్కుడును గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలు

మూడు మండలాల్లో పెరిగిన సాగు

కరువు ఛాయలు ఉన్న రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో చాలా మంది రైతులు కూరగాయల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బోరుబావుల్లో నీరు తగ్గిపోవడం, పెట్టుబడి భారం దృష్ట్యా గోరుచిక్కుడు, బెండ, టమోట, మిరప, అనప, చిక్కుడు వంటి పంటలను సాగుచేస్తున్నారు. ఈ మూడు మండలాల్లో దాదాపు 1000 హెక్టార్లకు పైనే కూరగాయల సాగు చేస్తున్నారు. దిగుబడి బాగానే ఉన్న మార్కెట్ సౌకర్యం లేక పంటను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పండిన పంటను గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోల్లో మండల కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి బొలెరో వంటి వాహనాల్లో బాగేపల్లి, బెంగళూరు, కోలార్ తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. వంద కిలోల బస్తాకు రూ. 250 నుంచి రూ.300 రవాణా ఖర్చు వస్తోందని రైతులు చెబుతున్నారు. ఒక్కోసారి హఠాత్తుగా ధరలు తగ్గినప్పుడు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం సరైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించి తమ కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ఎకరం నుంచి మూడెకరాల వరకు..

ఉమ్మడి జిల్లాలో వర్షాభావంతో బోరు బావుల్లో నీరు తగ్గిపోవడంతో ఇతర పంటలను వదిలేసి ఎక్కువ మంది రైతులు కూరగాయల సాగువైపు మళ్లారు. ఎకరం నుంచి మూడెకరాల వరకు కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో కూరగాయల సాగు బాగా పెరిగింది. టమోటాకు మాత్రమే జిల్లాలో మార్కెట్ సౌకర్యం ఉండగా ఇతర కూరగాయలకు లేకపోవడంతో సమీపంలోని కర్ణాటకకు తరలిస్తున్నారు. దీంతో ఖర్చులు రెట్టింపు అయ్యి పెద్దగా గిట్టుబాటు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





కూరగాయలను బెంగళూరు మార్కెట్‌కు తరలించేందుకు సీకేపల్లిలో లోడ్ చేస్తున్న రైతులు

మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి



పండించిన పంటను అమ్ముకోవడానికి సరైన మార్కెట్ సౌకర్యం లేదు. ఒక టమోట తప్పా మిగిలిన కూరగాయలను కర్ణాటకకు తీసుకెళ్లి అమ్ముకోవాల్సిందే. రైతుల ఇబ్బందులను చూసి జిల్లాలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే రైతుకు ఎంతో మేలు జరుగుతుంది.
- అంజి, రైతు, ప్యాదిండి

తడిసి మోపెడవుతున్న ఖర్చు



గోరుచిక్కుడు తోట



ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి పంటలను సాగు చేసుకుంటున్నాం. దిగుబడి బాగున్నా పండిన పంటను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పొలం నుంచి మార్కెట్‌కు తరలించే పాటికి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించాలి
- నరేంద్రరెడ్డి, రైతు, మామిళ్లపల్లి

కేసుల పరిష్కారానికి కృషి చేయండి: జిల్లా న్యాయాధికారి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3: జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి కక్షిదారుల్లో అవగాహన పెంచి, కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. జిల్లా కోర్టులో ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ నేపథ్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు సంబంధించిన అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌కు మరిన్ని కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

అరటి నారతో అల్లికలపై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 3: అరటి నారతో వివిధ అల్లికల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు తెలిపారు. మండలంలోని కురుగుంటలో అనంత గ్రామీణ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ కలెక్షన్ సెంటర్‌కు ఉద్యానశాఖ 75శాతం రాయితీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సెంటర్‌ను రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. మూసా ఫైబ్రెల్ అనే సంస్థ మహిళలకు అరటి నార తీసి చేతి సంచులు, ఇంటి అలంకరణ వస్తువులు, పేపర్ తయారీ, వస్త్రాల తయారీపై శిక్షణ ఇస్తుందన్నారు. జిల్లాలో దాదాపు 25వేల ఎకరాల్లో అరటి సాగు అవుతోందని, గెలలు కోసిన తరువాత రైతులు అరటి బోదెలను పడేయకుండా విక్రయించి మరింత ఆదాయం పొందవచ్చన్నారు. మూసా ఫైబ్రెల్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ అరటి నారతీసే యంత్రం, కటింగ్ మిషన్ ఒకటిన్నర లక్షల రూపాయలకు అందిస్తామన్నారు. దీని ద్వారా రోజుకు 25 కిలోల నార తీయవచ్చున్నారు. అరటి నారా ఉత్పత్తులకు దేశీయంగా విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళా రైతులకు ఉచిత శిక్షణతో పాటు రోజుకు రూ.300 అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం ఇంటి వద్దే అరటి పీచుతో వివిధ వస్తువులు తయారు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి నాబార్డు ఏజీఎం అనురాధ, అనంతపురం డివిజన్ వ్యవసాయాధికారి రవి, మండల ఉద్యానశాఖ అధికారిణి రత్నకుమారి, రెడ్స్ సంస్థ భానుజా తదితరులు పాల్గొన్నారు.

పండుగలా..

- ☆ దులీప్‌ట్రోఫీ నిర్వహణపై రాజీపడొద్దు
- ☆ ప్రజలు, విద్యార్థులు ఆస్వాదించేలా ఏర్పాట్లు
- ☆ ట్రాఫిక్, పార్కింగ్ సమస్య లేకుండా చూడండి
- ☆ అధికారులతో సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3: జిల్లాలో తొలిసారి నిర్వహించే దులీప్‌ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లను ప్రజలు పండుగలా ఆస్వాదించేలా అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. దులీప్‌ట్రోఫీకి సంబంధించి ఏసీజీలో చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఏమాత్రం రాజీ పడకుండా దులీప్ ట్రోఫీ నిర్వహించాలన్నారు. గ్రౌండ్ వద్ద బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రౌండ్‌లోకి క్రీడాకారులు, సిబ్బంది, ప్రతినిధులు, పబ్లిక్ ఎంట్రీ, ప్రెస్, వీఐపీలు, వీవీఐపీలు వచ్చి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్ సమస్య రాకుండా చూడాలన్నారు. మ్యాచ్‌లను చూసేందుకు జేఎన్‌టీయూ, ఎస్కేయూ, సెంట్రల్ యూనివర్సిటీ, ఒకేషనల్ ఎడ్యుకేషన్, ఆయా విద్యాసంస్థల విద్యార్థులను తీసుకురావాలని సూచించారు. తాగునీటి వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, ఆర్డీఓ వసంతబాబు, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీపీఓ ప్రభాకర్ రావు, డీఎస్‌డీఓ షపీ, డీఎంహెచ్ఓ ఈబీదేవి, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్, సీట్లు కేటాయింపు

దులీప్‌ట్రోఫీకి సంబంధించి క్రికెట్ పోటీలు గురువారం నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభించనున్నారు. ఈ మ్యాచ్‌లను వీక్షించడానికి వచ్చే వారికి వాహనాల పార్కింగ్, ప్రవేశాలు, సీట్ల కేటాయింపులు చేశారు. ఉదయం ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ హరికుమార్, బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు బ్లాక్‌లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించి, మ్యాప్‌ను తయారు చేశారు. మొత్తం ఆరు గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఏ బ్లాక్‌లో బీసీసీఐ ప్రతినిధులకు కేటాయించారు. బీ బ్లాక్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు కేటాయిం చారు. సీ, డీ, ఈ, ఎఫ్ బ్లాక్‌లు సాధారణ ప్రేక్షకులకు కేటాయించారు. ఎఫ్ బ్లాక్ పక్కన మీడియా గ్యాలరీ ఏర్పాటు చేశారు.



దులీప్‌ట్రోఫీ నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

పార్కింగ్ వాహనాలు ఇలా...

మ్యాచ్‌కు వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు నాలుగు ప్రాంతాలు కేటాయించారు. ప్లేయర్ల వాహనాలు, ఏ, బీ గ్యాలరీలలోకి వెళ్లే వారు గేట్ నంబరు- 2లో వెళ్లి వాహనాలు నిలపాలి. గేట్-1లో వాహనాలకు అనుమతి లేదు. గేట్-1 నుంచి సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీలలోకి పాసులు కల వారు నగరంలో నుంచి వచ్చే సాధారణ వాహనాలు నగరవనం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ చేసి లోపలికి నడకదారిలో వెళ్లాలి. ఇక కదిరి, ఎస్కేయూ, రాప్తాడు వైపు నుంచి వచ్చే వాహనాలకు సెయింట్ డీ-పాల్ స్కూల్‌లో పార్కింగ్ కేటాయించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

దులీప్‌ట్రోఫీకి సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ జగదీష్ నేతృత్వంలో పోలీసులు భద్రతా చర్యలు చేపడుతున్నారు. సుమారు 400మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. ప్లేయర్లు బసచేస్తున్న అలెగ్జాండర్, మాసినేని హోటళ్ల వద్ద సాధారణ పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇక ప్లేయర్లు హోటల్ నుంచి గ్రౌండ్‌కు వెళ్లి వచ్చే దారిలో పోలీసులు ప్రత్యేకంగా కాన్వాయ్ ఏర్పాటు చేశారు. ఇక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అడుగడుగున పోలీసుల నిఘా కొనసాగుతోంది. పోలీసులతో పాటు ప్లేయర్లకు బౌన్సర్లను రక్షణగా ఏర్పాటు చేశారు. ఈనెల 5 నుంచి 22 వరకు ఐదు మ్యాచ్‌లు ఏసీజీలో నిర్వహించనున్నారు.

జీడిపల్లికి 1085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 3: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 1085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 830 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. మరువ ద్వారా పీఏబీఆర్‌కు 210 క్యూసెక్కులు వెళ్తున్నట్లు వెల్లడించారు.

సాధన ప్రారంభం





ప్రాక్టీస్‌కు వస్తున్న క్రికెటర్లు

ఆటగాళ్ల సాధన







అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3: దులీప్‌ట్రోఫీలో ఆడేందుకు నగరానికి వచ్చిన భారత క్రికెట్ క్రీడాకారులు మంగళవారం సాధన ప్రారంభించారు. బస చేసిన అలెగ్జాండర్ హోటల్ నుంచి పోలీసు ఎస్కార్ట్‌తో ఏసీజీకి వచ్చిన ఆటగాళ్లు అక్కడ ప్రాక్టీస్ చేశారు. ఇండియా-సీ జట్టులో భారత కీలక ఆటగాళ్లు రుత్‌రాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరల్, బి ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్‌యాదవ్, వైశాక్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షుచౌహాన్, మయాంక్ మార్కండే, సందీప్ వారియర్ ఉన్నారు. ఇండియా-డీ జట్టులో...శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), ఆతర్వ తైడే, యష్‌దుబే, దేవ్‌దత్ పడిక్కల్, ఇషాన్‌కిషాన్, రిక్కీభూయ్, సరాన్ష్ జైన్, అక్షర్‌పటేల్, అర్ష్‌దీప్‌సింగ్, ఆదిత్యథాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరబ్‌కుమార్‌లు ఏసీజీలో నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. అంతకు ముందు బీసీసీఐ ప్రతినిధులు అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంచోఫెర్రర్, ఇతర ప్రతినిధులు ఏసీజీలో ప్రాక్టీస్‌కు సంబంధించిన, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇండియా సి, డి జట్ల ఆటగాళ్లు ఏసీజీలో నెట్ ప్రాక్టీస్ చేశారు.





అప్రమత్తంగా ఉండండి: డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 3: వర్షాల నేపథ్యంలో ప్రతి హాస్టల్ వార్డెన్ అప్రమత్తంగా ఉండాలని బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల డీడీ కుష్బూకొఠారీ ఆదేశాలు జారీ చేశారు. సీపీఓ కార్యాలయంలో జిల్లాలోని బీసీ, ఎస్సీ వార్డెన్లతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 100 రోజులు, 500 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత వర్షాకాలంలో కొన్ని హాస్టల్ భవనాల్లో నీరు కారుతోందని, వాటిపట్ల దృష్టి సారించి సాధ్యమైనంత వరకూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రహరీలు పడిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉండటంతో ఎప్పటికప్పుడు విద్యార్థులకు మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే విషయంపై డీఎంహెచ్‌ఓకు లేఖ రాశామన్నారు. వార్డెన్లు కూడా సమీపంలో ఉన్న వైద్యులని కలిసి విద్యార్థులకు వైద్య చికిత్స అందించాలన్నారు. ప్రతి హాస్టల్‌లో రికార్డు మెయింటెనెన్స్ చేయాలన్నారు. వార్డెన్లు, వర్కర్ల నెంబర్లతో పాటు.. జిల్లా అధికారుల ఫోన్ నెంబర్లను హాస్టల్‌లో బోర్డులో అతికించాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ సూపరింటెండెంట్ నాగరత్నమ్మ, ఏబీసీడబ్ల్యూఓలు రంగమ్మ, సుభాషిణి, గంగాద్రి, ఏఎస్‌డబ్ల్యూఓలు దామోదర్‌రెడ్డి, రాధిక, రామ్మోహన్, బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్ పాల్గొన్నారు.



వార్డెన్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల డీడీ కుష్బూకొఠారీ

బీఈడీ పరీక్షల్లో 95 శాతం పాస్

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 3: ఎస్కేయూ బీఈడీ పరీక్షల్లో 95 శాతం మంది పాసయ్యారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత బీఈడీ పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ 632మంది పరీక్షలు రాయగా 631మంది విద్యార్థులు పాస్ అయ్యారని తెలిపారు. కేవలం ఒక విద్యార్థి మాత్రమే ఫెయిల్ కావడంతో పాస్‌శాతం 95.09గా నమోదైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వారి ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, సీఈ డాక్టర్ లోకేష్, ఏఆర్ శంకర్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్‌యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్ మంగళవారం 5250 టన్నుల టమోటాలు రాగా కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు తెలిపారు.

మాజీ ఎంపీపీ పీవీ చౌదరికి ఘన నివాళి



పీవీచౌదరి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు, సెప్టెంబరు 3: మాజీ ఎంపీపీ పీవీచౌదరి అంత్యక్రియలను మంగళవారం ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, టీడీపీ నాయకులు నిర్వహించారు. రాయదుర్గం, పుట్టపర్తి ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆలం నరసానాయుడులు పీవీ చౌదరి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి పీవీ చౌదరి కృషి చేశారన్నారు. మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం ఆయన కుమారులు పీవీ వెంకటేశ్వరప్రసాద్, డాక్టర్ పీవీ రాంప్రసాద్‌ను పరామర్శించారు.



నివాళులు అర్పిస్తున్న రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రాష్ట్ర నాయకుడు ఆలం నరసానాయుడు

రవీంద్రను అభిమానించే వారంతా మా కుటుంబ సభ్యులే

ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, సెప్టెంబరు 3: దివంగత పరిటాల రవీంద్రను అభిమానించే ప్రతి ఒక్కరూ మా కుటుంబ సభ్యులే అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురంలో నసనకోట ముత్యాలమ్మకు పరిటాల కుటుంబసభ్యులు మొక్కులు తీర్చుకుని మంగళవారం విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిటాల అభిమానులు కూడా వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిటాల పేరుమీద ఏ కార్యక్రమం తలపెట్టినా జిల్లానుంచే కాక రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు వేలాదిగా తరలిరావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు పరిటాల రవీంద్ర ఘాట్‌కు నివాళులర్పించారు. విందుకు హాజరైన వారిలో ఎంపీలు బీకేపార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, బండారు శ్రావణి, ఎంఎస్‌రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ శ్రీసత్యసాయిజిల్లా అధ్యక్షుడు వడ్డే అంజనప్ప, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, అనంతపురం జిల్లా జనసేన అధ్యక్షుడు టీసీవరుణ్, నాయకులు భవానీ రవికుమార్, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ మేయర్ స్వరూప, కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ తదితర ప్రముఖులు ఉన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



విందుకు హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు

వైభవంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం


శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 3 : శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా మండలంలోని తుంపర్తి గ్రామంలో స్వామివారి ప్రతిమను మంగళవారం ఊరేగించారు. ప్రభోద సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక త్రైతసిద్ధాంతం ఆధ్వర్యంలో దీన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సేవాసమితి సభ్యులు తరలివచ్చారు. గ్రామోత్సవంలో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇందూజ్ఞాన వేదిక తుంపర్తి కమిటీ అధ్యక్షులు అప్పిరెడ్డి, శివారెడ్డి, ప్రతాప్, యోగానందరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గోవిందు, రామ్మోహన్‌రెడ్డి, కాంతమ్మ, శ్రీలత, వరలక్ష్మీ, లక్ష్మీ పాల్గొన్నారు.

గంగమ్మకు బోనాలు



కదిరి అర్బన్, సెప్టెంబరు 3: మండలంలోని విఠలరాయుని చెరువు గంగమ్మకు మరవతండా గ్రామస్థులు మంగళవారం బోనాలు సమర్పించారు. ఇంటికో బోనంతో గ్రామం నుంచి ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి తప్పెట్లతో తీసుకువచ్చి అమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా వెండిరథ ప్రాకారోత్సవం


వెండిరథంలో స్వామి, అమ్మవార్లు

కదిరి, సెప్టెంబరు 3 : పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుల స్వామివార్లకు వెండిరథం ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. వెండిరథంపై కొలువుదీరిన స్వామివారికి సుగంధ పుష్పాలు, కదిరి మల్లెలు, తులసీమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తరువాత ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రకారోత్సవం వైభంగా నిర్వహించారు. పలురకాల పండ్లు సమర్పించి, ప్రసాద వితరణ చేశారు. పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రజావేదిక

నల్లచెరువు, సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రి ఆవరణంలో మంగళవారం ఉపాధిహామీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24కు ఉపాధి పనులపై ఎంపీడీఓ శకుంతల, ఎపీఓ మంజుల అధ్యక్షతన ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు. 13 పంచాయతీల్లో ఉపాధి, పంచాయతీరాజ్, సర్వశిక్ష అభియాన్ కింద రూ.7,72,91,800తో పనులు చేసినట్లు తెలిపారు. పీడీ ఉపాధి కింద రూ.15,819, పంచాయతీరాజ్ కింద రూ.14,361 అవినీతి జరిగినట్లు వెల్లడించారు. ఓరువాయిలో నిర్వహించిన ఉపాధి పనుల్లో అవినీతి జరిగిందని ఆ గ్రామస్థులు రమణారెడ్డి, దేవేంద్రగౌడ్, ప్రభాకర్‌నాయుడు పీడీ, ఏపీడీలకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని సంబంధితాధికారులతో చర్చించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెంట్ శివారెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రాజ్‌కుమార్, ఉపాధి సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం ఉన్నారు.

ఐకేపీ కార్యాలయంలో చెక్కులు మాయం

కొత్తచెరువు : స్థానిక ఐకేపీ కార్యాలయంలో లోన్‌లెడ్జర్, చెక్కులు మాయమయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన బుక్‌కీపర్లు అవకతవకలకు పాల్పడటంతో ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కానీ చర్యలు తీసుకోకనే సద్దుమునిగింది. లోన్ లెడ్జర్, చెక్కులు మాయమైనా.. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయం మంగళవారం బయట పడటంతో మహిళాసంఘాల సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. లోన్ లెడ్జర్, చెక్కులు మాయమైన మాట వాస్తవమేనని, బాధ్యులకు నోటీసులు జారీచేశామని ఏపీఎం రవీంద్రారెడ్డి తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యసేవలపై సమావేశం

కొత్తచెరువు : ఎన్టీఆర్ వైద్యసేవలపై ఆరోగ్య మిత్రులు, కో-ఆర్డినేటర్లతో స్థానిక సీహెచ్‌సీలో ఎన్టీఆర్ వైద్య జిల్లా అధికారి డాక్టర్ శ్రీదేవి మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవలు సక్రమంగా అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్లు యల్లప్ప, శివకుమర్ పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది మృతి


విజయకుమార్ (ఫైల్)

కదిరిలీగల్: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఏ. విజయకుమార్ (65) అనారోగ్యంతో మంగళవారం మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. విజయకుమార్ మృత దేహానికి కదిరి న్యాయవాదులు కృష్ణమూర్తి, రవీంద్రబాబు, లోకేశ్వర్‌రెడ్డి నివాళులర్పించారు. న్యాయవాదుల సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఉంచి సంతాపం తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ధర్మవరంరూరల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చినట్లు నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్, సీడాప్ డీపీటీఎం నారాయణస్వామి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ఐదు కంపెనీ ప్రతినిధులు హాజర య్యారని, 188 మంది నిరుద్యోగుల్లో 77 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. నిరుద్యోగుల కోసం ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించడం అభినందనీయమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి పీఏ హరీష్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ బాలస్వామి, సీడాప్ ప్రతినిధులు, ఎంప్లాయ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్

శిశువుల పెరుగుదలపై అవగాహన

ఓబుళదేవరచెరువు: శిశువు పెరుగుదల, ముఖ్యమైన పోషణ తదితర అంశాలపై జిల్లా యుమినేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్ స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార అధికారి బాబాఫక్రుద్దీన్, వైద్యులు భానుప్రకాష్‌నాయక్, కమల్ రోహిత్, కమ్యూనిటీ హెల్త్ అధికారి కుమారస్వామిరెడ్డి, సిబ్బంది సుభాషిని, విజయకుమారి, మురళి, దిల్‌షాద్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుస్తుల వితరణ

ముదిగుబ్బ, సెప్టెంబరు 3: స్థానిక వడ్డిపేట ప్రాథమిక పాఠశాలలోని 40 మంది పేద విద్యార్థులకు కాంగ్రెస్ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, గోవిందమ్మ దంపతులు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

ఉపాధే ఊతం..!

- పల్లెల్లో జోరుగా అభివృద్ధి పనులు..
- మారనున్న గ్రామాల రూపురేఖలు
- పనుల ఎంపికకు గ్రామసభలు
- రైతులు, పాడి రైతులకూ చేయూత

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 3: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లగా ప్రజా సమస్యలను గాలికి వదిలేసింది. గ్రామీణుల పరిస్థితి మరీ ఘోరం. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడానికి.. అభివృద్ధి పనులకు కేంద్రం కేటాయించిన నిధులను ఆ ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దీంతో అనేక సమస్యలతో గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ప్రజా సమస్యలపై దృష్టి సారించింది. ఉపాధి నిధులతో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి.. అభివృద్ధి పనులు చేపట్టేలా అడుగులు వేసింది.

గ్రామాలకు మహర్దశ

కూటమి ప్రభుత్వం పల్లెల్లో సిమెంటు, బీటీ రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి మండలానికి దాదాపు రూ. మూడు కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈదిశగా పనులు చేపట్టేందుకు డ్వామా, పంచాయతీ రాజ్ శాఖ, ఇంజనీరింగ్ శాఖాధికారులు ప్రతిపాదనలు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. ఐదేళ్లగా అంతర్గత మట్టిరోడ్లు, మురుగునీటి నిల్వలతో ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామాల్లో అభివృద్ధి పనుల ఎంపిక కోసం ఓడీసీలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యేడాది నుంచి కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా గ్రామ సభల్లో ప్రతిపాదించిన పనులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.కోట్లు అందిస్తోంది. దీంతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టనున్నాయి. గ్రామాలు ప్రగతి పట్టుకొమ్మలు అనే నానుడిని కూటమి ప్రభుత్వం నిజం చేసి చూపిస్తోంది.

సర్పంచ్‌ల్లో నూతనోత్సాహం

గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు వచ్చే నిధులతో పాటు, ఉపాధి నిధులను పక్కదారి పట్టించడంతో గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సర్పంచ్‌లుగా ఎన్నికై దాదాపు మూడేళ్ల కావస్తున్నా.. అభివృద్ధి పనులకు మాత్రం వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. రెండువేల కోట్లు విడుదల చేసింది. వీటితోపాటు ఉపాధి పథకం కింద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు రావడంతో సర్పంచ్‌లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

పాడి రైతుకు చేయూత

పాడి పరిశ్రమ అంతరించిపోతున్న తరుణంలో ఆ రంగానికి కూటమి ప్రభుత్వం ఊపిరిపోసేలా చర్యలు చేపట్టింది. ఉపాధి పథకం కింద పాడి, గొర్రెలు, మేకలు సంరక్షణ కోసం మినీ గోకులం కింద 90 శాతం సబ్సిడీతో సన్నచిన్నకారు రైతులకు షెడ్ల నిర్మాణం చేపడుతోంది. దీంతో పాడిరైతులు ఇబ్బంది పడకుండా పాడి ఆవుల సంరక్షణతో పాటు, వారు ఆర్థికంగా అభివృద్ధికి బాటలు వేస్తోంది.

సర్పంచ్‌లకు పూర్వవైభవం



గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లోని సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదు. పంచాయతీల నిధులనూ పక్కదారి పట్టించింది. సర్పంచ్‌లకు ఏ అధికారు లూ లేకుండా చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, కాలువల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయం. మళ్లీ సర్పంచ్‌లకు పూర్వ వైభవం వచ్చినట్లైంది.

\- రేణుకాబాయి సర్పంచ్, శేషయ్యగారిపల్లి తండా

ఇక గ్రామాల్లో అభివృద్ధి



గత ఐదేళ్లలో పంచాయతీలకు వచ్చే నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. మేము సర్పంచ్‌లుగా ఉన్నా నిధులు లేకపోవడంలో అభివృద్ధి చేయలేక పోయాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇక గ్రామాలు అభివృద్ధి దశలో పయనిస్తాయి. పంచాయతీలకు రావాల్సిన నిధులు కూడా కూటమి ప్రభుత్వం ఇస్తోంది.

\-లక్ష్మీదేవమ్మ, సర్పంచ్, సున్నంపల్లి

పాడిపరిశ్రమకూ ఊతం



గతంలో షెడ్ల నిర్మాణం లేకపోవడంతో పాడి ఆవులకు ఆరుబయట ఎండలోనే ఉంచి పోషించేవాళ్లం. పైగా గత వైసీపీ పాలనలో పాడిరైతులకు ప్రోత్సాహం కరువైంది. బీమా ఇచ్చిన పాపానపోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాడి రైతుల ఇబ్బందులను గుర్తించి సబ్సిడీతో షెడ్లను నిర్మించి ఆదుకుంటోంది. ఇక పాల ఉత్పత్తి పెరుగుతుంది.

\-నాగేంద్రమ్మ, వెంకటాపురం

పోలా పోరాటం మరువలేనిది

సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంభూపాల్

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 3: సీపీఎం రాష్ట్ర చేనేత నాయకుడు పోలా రామాంజనేయులు సంస్మరణ దినాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి స్థానిక ఎన్‌జీఓ హోంనందు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంభూపాల్ మాట్లాడారు. ధర్మవరంలోని చేనేత సమస్యలపై పోరాడి చేనేతలకు సబ్సిడీలు, గిట్టుబాటు ధరలు కల్పించడంలో పోలా రామాంజనేయులు పోరాటం మరువలేనివన్నారు. కార్మిక సమస్యలపై దశలవారీగా అనే కార్యక్రమాలు చేపట్టారని ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, నాయకులు ఆదినారాయణ, ఆయూబ్ ఖాన్, ఎస్‌ఎఫ్‌ఐ నామాల నాగార్జున, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ పోతక్క, దాము, బాబు, శీనా, గంగాధర్, వెంకటస్వామి, చౌడప్ప, హరి, రమణ, బాలాజీ, ఖాదర్ బాషా, సత్తి, అన్నంసూరి, నేలకోటప్ప, కార్మికులు పాల్గొన్నారు.


పోలా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాంభూపాల్, నాయకులు

బాధితులకు పరామర్శ

నల్లమాడ, సెప్టెంబరు 3 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అనంతపురం, కదిరి ఆసుపత్రిల్లో మంగళవారం పరామర్శించారు. మండలంలోని దొన్నికోట, గూడమేకలపల్లి, బొగ్గిటివారపల్లి, కాయలవాండ్లపల్లి, సుబ్బరాయునిపల్లి గ్రామాలకు చెందిన కూలీలు మంగళవారం తెల్లవారుజామున తనకల్లు మండలం సమీపంలోని గండోడివారిపల్లి పల్లివద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెల్సిందే. కదిరి, అనంతపురం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న గాయపడిన వారిని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఆర్థికసాయం అందించారు.

ఘన నివాళి

బుక్కపట్నం : మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పాముల చిన్న అక్కులప్ప సోమవారం మరణించారు. మంగళవారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

కౌలురైతులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి


డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

పుట్టపర్తి, సెప్టెంబరు 3: చిన్న, సన్నకారు కౌలు రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య పేర్కొన్నారు. మంగళవారం రైతుసంఘం నాయకులు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందచేశారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలురైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ట్రస్టు భూములు, వక్ఫ్ భూములు సాగు చేసుకుంటున్న కౌలురైతులకు గుర్తింపుకార్డులు మంజూరు చేసి రుణాలు ఇవ్వాలన్నారు. సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందచేయాలన్నారు, ఈ-పంట నమోదు కార్యక్రమంలో గుర్తింపు కార్డులు లేకపోయినా సాగులో ఉన్న వారిపేరుతో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కమతం కాటమయ్య, చలపతి, చంద్ర, వేమనారాయణ, చిన్నఎల్లప్ప, గోపాల్ పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి


ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కొత్తచెరువు, సెప్టెంబరు 3 : కాలనీకి 12 రోజులుగా సత్యసాయి తాగునీరు సరఫరా కావడం లేదని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక విజయనగర కాలనీ, మండలంలోని నాగిరెడ్డిపల్లి కాలనీలకు చెందిన మహిళలు వాపోయారు. మంగళవారం వారు ఖాళీ బిందెలతో సత్యసాయి పంప్‌హౌస్ వద్ద నిరసన చేపట్టారు. సత్యసాయి కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు.

నిందితులకు రిమాండ్

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 3 : మండలంలోని కుణుతూరులో ఈనెల 2న టీడీపీ వర్గీయుడు ప్రకాష్‌గౌడ్‌పై అదేగ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు కొడవళితో దాడి చేసిన విషయం తెల్సిందే. బాధితుడు ప్రకాష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ వర్గీయులైనా నరేంద్ర, ఈశ్వరమ్మ, నారాయణస్వామి, మీనాక్షి, ఆనంద్‌పై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిపై హత్యాయత్నం సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరికి కోర్టు రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం రూరల్: ఆశావర్కర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, వారికి రెగ్యులర్‌గా జీతాలు అందించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దర్శినమల పీహెచ్‌సీలో ఆశావర్కర్లతో కలిసి వైద్యాధికారి దిలీప్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆశావర్కర్లపై పనిభారం పెంచడం తగదన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు యూనియన్ సభ్యులు పుష్ప, భానుబీ, నాగలక్ష్మీ, సుశీలమ్మ, సావిత్రి, నాగవేణి, రాములమ్మ పాల్గొన్నారు.

విద్య, క్రీడా సామగ్రి అందజేత

బుక్కపట్నం: మండలంలోని నారసింపల్లి, నారసింపల్లి తండా పాఠశాలల విద్యార్థులకు సింగపూర్ దేశానికి చెందిన సత్యసాయి భక్తులు చోమ్లీ శివశంకర్ నేతృత్వంలో దాదాపు రూ.లక్ష విలువచేసే క్రీడా, విద్యాసామగ్రిని మంగళవారం అందించారు. అలాగే గ్రామస్థులకు నిత్యావసరవస్తువులు అందించారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

కదిరి అర్బన్, సెప్టెంబరు 3: రోగులకు మెరుగైన సేవలందించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కదిరి ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ విజయలక్ష్మీకి వినతిపత్రం అందించారు. నాయకులు కదిరప్ప మాట్లాడుతూ.. కదిరి ఏరియా ఆసుపత్రికి రోజు వందలాది మంది రోగులు వస్తుంటారని, వారికి మెరుగైన సేవలందించడంతో కొంతమంది డాక్టర్లు, సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని అన్నారు. సీజనల్ వ్యాధులతో చాలామంది రోగులు బాధపడుతున్నారని, వారికి మెరుగైన సేవలందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలో గాయపడిన వారికి వెంటనే చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఉపేంద్ర, శ్రీనివాసులు, జనార్ధన్, రాజేష్, త్రిలోక్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 3 : మండలంలోని మహమ్మదాబాద్ మూడు రోడ్ల కూడలిలో ఎస్ఐ వెంకటనారాయణ మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కదిరి అర్బన్, సెప్టెంబరు 3: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీలత సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలిక కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సైబర్ నేరాలకు గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నారాయణరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొత్తచెరువు, సెప్టెంబరు 3 : మండలంలోని యర్రపల్లి గ్రామ సమీపంలోని వంగ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను స్థానిక కళాశాల సమీపంలో మంగళవారం సీజ్ చేసినట్లు సీఐ ఇందిరా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు. అయితే రెండు ట్రాక్టర్లు పట్టుబడితే ఒక ట్రాక్టర్‌నే సీజ్ చేసినట్లు సమాచారం.

టీడీపీ కార్యకర్త మృతి

నల్లచెరువు, సెప్టెంబరు 3: మండలంలోని దేవరింటిపల్లిలో టీడీపీ సీనియర్ కార్యకర్త జీర్లకుంట చాకలి వెంకటరమణ (65) గుండెపోటుతో మంగళవారం మరణించాడు. మండల స్థాయి పార్టీ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాగభూషణనాయుడు, మాజీ జెడ్పీటీసీ అబ్దుల్‌ఖాదర్, సింగ్ విండో మాజీ ప్రెసిడెంట్ ఆంజనప్ప, బేకరీ నాగరాజు, తెలుగుయువత ప్రసాద్, మహమ్మద్ షాకీర్, ఫఠాన్ బాబ్‌జాన్, షేక్ బాబాఫక్రుద్దీన్, పి. బావా పాల్గొన్నారు.

సత్యసాయి కార్మికులకు జీతాలు చెల్లించాలి

ముదిగుబ్బ, సెప్టెంబరు 3: సత్యసాయి తాగునీటి కార్మికుల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని, మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం సత్యసాయి తాగునీటి కార్మికులు, స్థానికులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి కార్మికులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


ముదిగుబ్బలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సత్యసాయి కార్మికుల నిరసన

తాడిమర్రి: వేతనాలు చెల్లించాలని సత్యసాయి నీటి విభాగం కార్మికులు చేపట్టిన నిరసన మంగళవారంతో 13 రోజులకు చేరుకుంది. తాడిమర్రిలోని పంప్‌హౌస్ వద్ద కార్మికులు మూగజీవాలకు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కార్మికులు రాములప్ప, నాగార్జున, ఓబులేసు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన

నల్లమాడ , సెప్టెంబరు 3: మండలంలోని వేళ్లమద్ది, రెడ్డిపల్లి, దొన్నికోట గ్రామాల్లో రైతు సేవా సహాయకులు మంగళవారం చేపట్టిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పరిశీలించారు. పంటలు సాగుచేసి ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. అలా చేయించుకున్న రైతులకే రాయితీలు వర్తిస్తాయన్నారు. మండలంలో ఈ-పంట నమోదు వేళ్లమద్ది, రెడ్డిపల్లి, దొన్నికోట గ్రామాల్లో తక్కువ శాతం చేశారన్నారు. సకాలంలో నమోదు చేయాలన్నారు. లేదంటే రైతుసేవా సహాయకులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ సుమతి, రైతు సేవా సహాయకులు ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఓబుళదేవరచెరువు: మండలంలోని మామిళ్లకుంటపల్లిలో వేరుశనగ, కంది, మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం వేరుశనగలో కాయ వృద్ధి దశలో ఉందన్నారు. ఈ పంటకు మచ్చతెగుళ్ల ఆశించిందని, దీని నివారణకు రెండు మిల్లీ లీటర్ల ఎక్సాకోనోజల్‌ను లీటర్‌నీటిలో కలిపి.. పిచికారి చేయాలన్నారు. కందిపంట ప్రస్తుతం 60 రోజుల దశలో ఉందన్నారు. ఈపంటకు ప్రోపినోపాస్ 2 మిల్లీలీటర్‌లేదా ఓమేట్ మిల్లీలీటర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంట కంకి దశలో ఉందని, వీటికి యూరియా 50కిలోలు, లదా 25 కిలోలాలు, పోటాష్ ఎరువును వాడితే ఎక్కువ దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ వెంటేశ్వర్లు, డాక్టర్ భాస్కర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య, వ్యవసాయ శాఖ ఏడీ ఎస్. సత్యనారాయణ, ఏఓ ఇలియాజ్ అహమ్మద్, సిబ్బంది శ్రావణి, సరస్వతి పాల్గొన్నారు.


వేళ్లమద్దిలో ఈ- పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఫ్లోర్‌బాల్‌లో బుక్కపట్నం విద్యార్థినుల ప్రతిభ



బుక్కపట్నం: నర్సరావుపేటలో ఈనెల ఒకటో తేదీన జరిగిన ఫ్లోర్ బాల్ పోటీల్లో బుక్కపట్నం బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఈ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరపున పాల్గొన్న 9వ తరగతి విద్యార్థినులు ఎన్. లక్ష్మీ, కారుణ్య ప్రతిభ చాటారు. మంగళవారం ఆ విద్యార్థులను పాఠశాలలో ఘనంగా సన్మానించారు.

మండల హమాలీ యూనియన్ ఏర్పాటు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 3: మండల హమాలీ యూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం సీఐటీయూ అధ్యక్షకార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాముల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండలాధ్యక్షుడిగా గంగాద్రి, కార్యదర్శిగా ఎం. శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా ఎం. శివ, కోశాధికారిగా శ్రీనాథ్, కార్యవర్గ సభ్యులుగా ఎస్ శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసులు, ఎం. రమణప్ప, ఆదినారాయణను ఎన్నుకున్నారు.


హమాలీ యూనియన్ కార్యవర్గ సభ్యులు



ఎంపీ బీకే పార్థసారథికి కేక్ తినిపిస్తున్న కేశవయ్య, శ్రీనివాసులు

ఘనంగా ఎంపీ బీకే జన్మదిన వేడుకలు

పెనుకొండ, సెప్టెంబరు 3: హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి 65వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య వేడుకలు నిర్వహించారు. ఉదయం పార్థసారథి పెనుకొండ దర్గా సర్కిల్‌కు చేరుకోగానే పెద్దఎత్తున బాణసంచా పేలుస్తూ క్రేన్‌తో గజమాల వేశారు. కేశవయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు, బాబుల్‌రెడ్డి, రమేష్, మునిమడుగు వెంకటరాముడు, గుట్టూరు నాగరాజు, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వేలాది మంది నాయకులు, కార్యకర్తలు బీకేకు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలువేసి శాలువకప్పి 65కేజీల భారీ కేక్‌కట్‌చేసి ఆయనకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి ఊరేగింపుగా అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం వద్దకు వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. హాజరైన అభిమానులకు భోజనాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, అశ్వర్థనారాయణ, బొక్సంపల్లి రామక్రిష్ణ, సుబ్బరాయుడు, ఆదిశేషు, పోతిరెడ్డితోపాటు, బీజేపీ, జనసేన, వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.



గజమాలతో సత్కరిస్తున్న గుట్టూరు నాగరాజు

నేడు హౌసింగ్ బిల్లుల సమ్మేళనం

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 3 : గృహనిర్మాణం పూర్తయ్యి బిల్లులు రాని లబ్ధిదారుల కోసం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో గురువారం హౌసింగ్ పెండింగ్ బిల్లుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏఈ శ్రీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, మండల నాయకులు తదితరులు పాల్గొంటారన్నారు.

80 శాతం సబ్సిడీతో ఉలవల పంపిణీ

మడకశిర రూరల్, సెప్టెంబరు 3 : రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏఓ తిమ్మప్ప తెలిపారు. 10 కేజీల ఉలవల ప్యాకెట్ రూ.870 ఉందన్నారు. అందులో 80 శాతం సబ్సిడీ పోను రైతులకు కేవలం రూ.174కు అందిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసు కోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

6న డీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రారంభం

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 3 : ఈనెల 6న ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ప్రారంభించనున్నట్లు ఏడీసీడబ్ల్యుఓ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీ, ఎస్‌ఏ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఐసీ కాలనీలోని వివేకానంద కళాశాలలో కోచింగ్ ఏర్పాటు చేశామన్నారు.

ఇన్‌చార్జి ఈఓఆర్డీగా బాబూరావు

గోరంట్ల, సెప్టెంబరు 3: మండల ఇన్‌చార్జి ఈఓఆర్డీగా గోరంట్ల మేజర్ పంచాయతీ కార్యనిర్వాహణాధికారి బాబూరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈఓఆర్డీ సుధాకర్ గతనెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో, ఆస్థానం ఖాళీ అయింది. దీంతో బాబూరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా తెలిపారు.

నేడు వక్కరైతులకు అవగాహన సదస్సు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 3: అమరాపురం మండలంలోని వక్కతోట రైతులకు బుధవారం ఉదయం 11 గంటలకు వ్యవసాయ కార్యాలయం అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు నాగోనహళ్లి మంజునాథ్ తెలిపారు. సదస్సుకు కల్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరై వక్కతోట పెంపకం మరియు ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణపై వివరిస్తారన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

మడకశిర రూరల్, సెప్టెంబరు 3: మండలంలోని యూ రంగాపురం గ్రామం భూమానంద ఆశ్రమంలో నిత్యాన్నదానాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జపానంద స్వామి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివామూర్తి, భూమానంద స్వామి భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎంపీకి వినతి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 3 : ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి కోరారు. మంగళవారం ఎంపీ పార్థసారథిని కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమందేపల్లి మండల కేంద్రంలో 700సర్వేనంబరులోని 3.59ఎకరాల్లో 150మంది పేద కుటుంబాలు ఐదేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. అయితే ఎలాంటి నోటీసులు లేకుండా రెవెన్యూ అధికారులు గుడిసెలను తొలగించారన్నారు. ఇప్పటికైనా ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి

పెనుకొండ, సెప్టెంబరు 3 : విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీకళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పిన అభివృద్ధి శాఖ సీడ్‌ఆప్ సంయుక్తంగా మెగా జాబ్‌మేళా నిర్వహించారు. మేళాలోల ఐదు కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు.

కార్మికుల తొలగింపు ఆపాలి: ఏఐటీయూసీ

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 3: ప్రీకాట్ మిల్లులో పని చేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారని, వీటిని తక్షణమే నిలిపివేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఎల్‌ఓ(అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్) శేఖర్‌బాబుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికులను తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడమే కాకుండా, పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి తొలగించాలని చూడటం నీచమన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే భారీ నిరసన చేపడ్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బాబు, ప్రీకాట్ బి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మారుతీరెడ్డి, యూనియన్ అధ్యక్షుడు గంగాధర్, మాచప్ప, అలీమ్, శివకుమార్, నారాయణరెడ్డి, రంగప్ప తదితరులు ఉన్నారు.



ఏఎల్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు



ఆవేదనలో... అన్నదాత..!



- గొల్లపల్లి రిజర్వాయర్‌కు భూములిచ్చిన రైతుల పరిస్థితి దయనీయం
- నాడు రైతు.. నేడు కూలీ..
- పట్టించుకోని వైసీపీ పాలకులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 3: వారంతా సాగురైతులు, భూమినే నమ్ముకుని జీవనం సాగించే అన్నదాతలు..అయితే అందరూ బాగుండాలనే ధ్యేయంతో తమ విలువైన భూములను తక్కువ ధరలకే రిజర్వాయర్‌కు ఇచ్చారు. నేడు దయనీయ పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తప్ప ప్రత్యామ్నాయ మార్గంలేని పరిస్థితుల్లో గొల్లపల్లి రిజర్వాయర్ కోసం 1050 ఎకరాల భూమినిచ్చిన రైతుల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. మండలంలోని గొల్లపల్లి పంచాయతీ పరిధిలో అప్పటి ప్రభుత్వం రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆయకట్టు కింద ఉన్న భూముల సాగు, తాగునీటి సమస్యలు తలెత్తవని అలాగే ఈ ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకున్నారు. ఈ క్రమంలో ఎకరాకు రూ.70వేలు, బోరున్న రైతులకు రూ.లక్ష ఇచ్చి భూసేకరణ చేపట్టారు. ఇందులో 1050ఎకరాల పట్టా భూమి, 150ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. దాదాపు వెయ్యి మంది రైతులు భూములను కల్పోయారు. దాదాపు పదేళ్లపాటు రిజర్వాయర్ పనులు జరిగాయి. ఫేస్-2లో టీడీపీ ప్రభుత్వం కృష్ణాజలాలతో నింపారు.

చేపలు పట్టుకునేందుకైనా అనుమతివ్వండి..

తక్కువ ధరకు గొల్లపల్లి రిజర్వాయర్ కోసం భూములిచ్చాం. అదే రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు చేపలు పట్టుకుని ఉపాధి పొందేందుకు అవకాశం కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. ఎకరం రూ.70వేలు ఇచ్చిన నష్టపరిహారం వృథా అయ్యిందని ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు: రాజు, రైతు, గొల్లపలి

నాలుగు ఎకరాల భూమి బోరుతోసహా రిజర్వాయర్‌కు ఇచ్చాం. గత వైసీపీ ప్రభుత్వంలో చేపలు పట్టుకునేందుకు అనుమతులివ్వాలని స్థానిక నాయకులు, అధికారుల వద్ద మొర పెట్టుకున్నా ప్రయోజనం లేదు. టీడీపీ ప్రభుత్వమైనా రైతులపై జాలిచూపితే జీవితాంతం రుణపడిఉంటాం.



జీవనాధారం కోల్పోయారు..: బాబుల్‌రెడ్డి, గొల్లపల్లి

గొల్లపల్లి రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులు అదే గ్రామంలో సరైన జీవనాధారంలేక కూలి పనులకు వెళ్తున్నారు. మత్స్యశాఖ చొరవ తీసుకుని భూములు కోల్పోయిన రైతుకు రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు అనుమతివ్వాలి పర్యాటకంగా అభివృద్ధి చేసి రిజర్వాయర్ వద్ద ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఆయా కుటుంబాలకే ఇవ్వాలి



రిజర్వాయర్ మా పరిధిలో లేదు : చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖాధికారి

గొల్లపల్లి రిజర్వాయర్ మా మత్స్యశాఖ పరిధిలో లేదు. అలా ఉంటే నిబంధనల మేరకు కమిటీవేసి న్యాయం చేసేవారం. ప్రస్తుతం స్థానిక పంచాయతీ పరిధిలోనే న్యాయం చేసుకోవాలి.

రిజర్వాయర్ నిర్మాణంతోనే పరిశ్రమల రాక

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. టీడీపీ హయాంలో శరవేగంగా ఫేస్-2లో రిజర్వాయర్ పనులు పూర్తి చేశారు. కియా కార్లపరిశ్రమ యాజమాన్యాన్ని ఒప్పించి వాటి అనుబంధ పరిశ్రమలకు నీటి సరఫరా చేయడంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. నేడు కియా పరిశ్రమ ఎందరికో ఉపాధినిస్తూ కడుపు నింపుతోంది. రిజర్వాయర్ రాకతోనే ఈ ప్రాంతం రూపురేఖలు మారాయి. కియా కోసం భూములిచ్చిన రైతులకు అదే పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. అలాగే రిజర్వాయర్ కోసం భూములిచ్చిన రైతులకు ఉపాధి కల్పించాలని రైతులు కోరుతున్నారు. పూటగడవక కొందరు భూములు ఇచ్చిన రైతులు నేడు కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు.



అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: జిల్లా వైద్యాధికారి

గుడిబండ, సెప్టెంబరు 3: గ్రామాల్లో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆరోగ్య వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్ఓ మంజువాణి సూచించారు. మంగళవారం గుడిబండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య వైద్య సిబ్బంది, ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు అప్రమత్తంగా విధులు నిర్వహించి గ్రామాల్లో జ్వరాలు, వాంతులు విరేచనాలు సోకినవారిని గుర్తించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎస్.రాయాపురంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంత మందికి వైద్య చికిత్సలు అందించారనే విషయంపై అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వీరివెంట వైద్యాధికారులు శాంతి, శ్రీనివాసనాయక్, సౌందర్య, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మంజువాణి

బీజేపీలోనే మహిళలకు ప్రాధాన్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు శేఖర్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 3: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, నారీశక్తికి ప్రాధాన్యం ఇస్తున్న పార్టీ బీజేపీనేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మహిళా మోర్చా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మీ, మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మీ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీగౌడ్, కౌన్సిలర్ అంజలి, సంయోజక్ రమణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ దేవేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

అగళి, సెప్టెంబరు 3: మండలంలోని ఇరిగేపల్లి గొల్లహట్టి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మంగళవారం టీడీపీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీలోకి చేరారు. గుండుమల వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అందుకే టీడీపీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డా.శ్రీనివాస్‌మూర్తి, కురుబ సాధికార కన్వీనర్ గోవిందప్ప, జెడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి మండల ప్రధాన కార్యదర్శి జయప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అవార్డుకు ముగ్గురు ఉపాధ్యాయులు

పావగడ, సెప్టెంబరు 3: పావగడ నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ ప్రశస్తికి ఎంపిక చేసినట్లు బీఈఓ ఇంద్రమ్మ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సహోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న దుర్గమ్మ, వైఎన్ హొసకోటలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హనుమంతరాయప్ప, మరదాసనహళ్లిలో ఇన్‌చార్జి హెచ్ఎంగా పనిచేస్తున్న రాజగోపాల్‌ను ఎంపిక చేశామన్నారు. ఈనెల 5వ తేదీన వారికి అవార్డు ప్రదానం చేస్తామన్నారు.



దుర్గమ్మ



హనుమంతరాయప్ప



రాజగోపాల్

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

లేపాక్షి, సెప్టెంబరు 3: ప్రసిద్ధ పర్యాటకక్షేత్రం లేపాక్షిలో మంగళవారం వీరభద్రస్వామి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గా, వీరభద్రస్వామిని అలంకరించి అభిషేకాలు చేశారు.

అగళి: మండలంలోని మధూడి గ్రామంలో వీరభద్రేశ్వర స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు.



అలంకరణలో లేపాక్షి వీరభద్రస్వామి

కూలిన అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 3: పట్టణంలోని బోయగేరిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రహరీ కూలింది. సోమవారం సెలవు కావడంతో చిన్నారులు ఎవరూలేరు. మంగళవారం గమనించిన సిబ్బంది అధికారులకు తెలియజేశారు. అంగన్‌వాడీ సెంటర్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సీడీపీఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లలు ఎవరూలేక పోవడంతో ప్రమాదం తప్పిందన్నారు.



కూలిన ప్రహరీ



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

డిమాండ్ల సాధనకు ఆశాల ఆందోళన

పెనుకొండ/గోరంట్ల, సెప్టెంబరు 3: ఒప్పంద జీఓ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. మంగళవారం జరిగిన ఈ ధర్నా లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని, గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వేతనాల జీఓ అమలు చేయాలన్నారు. ఫీల్డ్ వర్క్, సెంటర్‌వర్క్, అదనపు పనులు, పనిచేయని సెల్‌ఫోన్లతో మెజార్టీ ఆశా కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, రాజేశ్వరి, తులసి పాల్గొన్నారు. గోరంట్లలో జరిగిన నిరసనలో ఆశకార్యకర్తల యూనియన్ నాయకులు ముంతాజ్, శకుంతల, షబ్బరీ, మంజుల తదితరులున్నారు.

కంటి చూపుపై అవగాహన

మడకశిర రూరల్, సెప్టెంబరు 3: కంటిచూపుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేత్రాదానంపై విద్యార్థులకు అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలులో భాగంగా మంగళవారం మండలంలోని ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు శ్రీరంగం శ్రీనివాసులు మానువుడి శరీరంలో కంటి యొక్క ప్రాముఖ్యత, దాని రక్షణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ద్విచక్రవాహనం బోల్తా .. వ్యక్తి మృతి

లేపాక్షి, సెప్టెంబరు 3 : ద్విచక్రవాహనం బోల్తా పడిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. మంగళవారం కంచిసముద్రం నుంచి మద్దిపికి వెళ్లే దారిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మద్దిపి గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మద్దిపి గ్రామానికి చెందిన రామాంజినప్ప(45)పనినిమిత్తం కంచిసముద్రం గ్రామానికి వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆటోలో లేపాక్షి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య గంగరత్నమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబానికి జీవనాధారమైన యజమాని మృతిచెందడంతో దిక్కులేకుండా పోయామనీ, ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

మడకశిర రూరల్, సెప్టెంబరు 3: మండలంలోని మణూరు పంచాయతీలో జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేకాట స్థావరాలపై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.55,400 నగదు 6 సెల్‌ఫోన్లు, 4 దిచక్రవానాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మణూరు పంచాయితీ పరిధిలో పేకాట,జూదం అధికంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఆరుగురిని పట్టుకోగా 11 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. త్వరలో వారినికూడా పట్టుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాముకాటుతో రైతు మృతి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 3: పాముకాటుతో రైతు మృత్యువాత పడ్డారు. మంగళవారం నల్గొండ్రాయనపల్లికి చెందిన రైతు రాంగోపాల్(39) పశువులను తోలుకుని పొలానికి వెళ్లారు. పొలంలో పశువుల కోసం గడ్డికోస్తుండగా పాము కాటేసింది. విష ప్రభావంతో రైతు పొలంలోనే మృతి చెందారు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అచేతనంగా పడిఉన్న అతన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రమాదేవి, కుమారుడు తరుణ్, కుమార్తె చైతన్య ఉన్నారు.



రైతు రాంగోపాల్ మృతదేహం

విద్యుదాఘాతంతో యువకుడు..

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 3 : అమరాపురం మండలం హేమావతి గ్రామంలో మంగళవారం సికిందర్(32) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్ఐ జనార్ధన్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. సికిందర్ తన చికెన్‌షాపులో చికెన్ కటింగ్ చేస్తున్నారు. చికెన్ క్లీనింగ్ మిషన్‌లో చేయిపెట్టి వ్యర్థాన్ని తీస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి కింద పడిపోయారు. గమనించిన సిబ్బంది హేమావతి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అక్రమ నిర్మాణంపై కాలనీవాసుల ఫిర్యాదు

గోరంట్ల, సెప్టెంబరు 3: పట్టణంలోని కదిరి ప్రధాన రహదారి నుంచి చౌడేశ్వరీ కాలనీకి వెళ్లే రహదారిని అక్రమిస్తూ భవన నిర్మాణం చేపట్టడంపై కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి బాబురావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. నిర్మాణదారుడు పైకప్పు స్లాబ్‌ను రోడ్డుపైకి మూడు అడుగులు వచ్చేలా సెట్రింగ్ వేస్తుండడంతో కాలనీవాసులు అభ్యంతరం తెలిపారు. రహదారిపై మెట్లు నిర్మిస్తే భవిష్యత్తులో తీవ్ర ప్రమాదం తప్పదన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ పట్టాలు తొలగిస్తాం: తహసీల్దార్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 3 : ఇళ్లులేని నిరుపేదల కోసం కేటాయించిన ప్రభుత్వ అప్రూవల్ లేఅవుట్‌లో మ్యాన్యువల్ ద్వారా తీసుకున్న పట్టాలు రద్దు చేస్తామని తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీఆర్ కాలనీ సమీపంలో ఉన్న లేఅవుట్‌ను తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు హౌసింగ్ అధికారులు డోర్‌టుడోర్ సర్వే చేశారు. ఈ లేఅవుట్‌లో 1006 మందికి ఆన్‌లైన్ ద్వారా పట్టాలు మంజూరు చేశామని ఇందులో 904మంది ఇళ్లు నిర్మించినట్లు గుర్తించారు. అయితే అప్పటి వైసీపీ నాయకుల అండతో ప్రజా అవసరాల కోసం వదిలిన 3.5ఎకరాలలో దాదాపు 200వరకు మ్యాన్యువల్, అనధికార పట్టాలు పొందినట్లు గుర్తించారు. కార్యక్రమంలో హౌసింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై అవగాహన

గోరంట్ల, సెప్టెంబరు 3: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బీఎల్‌ఓలతో అధికారులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ హనుమంతు ఎస్ఎస్ఆర్ ఇంటింటీ సర్వే, మృతిచెందినవారి పేర్ల తొలగింపు, నూతన ఓటర్ల నమోదు, నివాసప్రాంతాల మార్పులపై తీసుకోవాల్సిన చర్యలు గురించి బీఎల్‌ఓలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా, సీనియర్ అసిస్టెంట్ గణేశ్, గోరంట్ల ఆర్ఐ సోమశేఖర్ రెడ్డి, రెవిన్యూసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.